



# టేకిట్ ఈజీ!! - 3

శ్రీనివాస ఫణికుమార్ డొక్కా





## స్పార్క్..

ఆఫీసు వాడు పూర్తిగా ఇంట్లోంచే ఏడవమని వరం లాంటి శాపం ఇచ్చినప్పట్నించీ మరీ కనా కనికిష్టమైపోయింది థూ దీ..(ఇక్కడ సెన్సార్ వాడు బీప్ వేసుకుని యు బై ఎ సర్టిఫికెట్టిచ్చాడు). అసలే గవర్నమెంటుజ్జోగవంటే అందరికీ చులకనే. ఆఖరికి పురుగులమందేసేవాడికి కూడా. మొన్నటికి మొన్న ఆ తత్తుకొడుకు ఫోను చేసి నువ్వు ఏరోజు ఇంట్లో వుంటావో చెప్పు, ఆరోజొచ్చి, గరాజ్ లో చిల్లులెట్టి కందకాలు చేసి, వాటిలో రసాయనాలు పొయ్యాలన్నాడు. ఎందుకురా అంటే, పురుగులు ఆ కందకాలలో పడి చచ్చిపోతాయిట. (ఎవడు చూడొచ్చాడు? ఎవడికి తీరిక, వచ్చిన పురుగులూ, చచ్చిన పురుగులూ లెఖ్ఖెట్టుకుంటూ కూచుంటామా?) సర్లే ఏడవమన్నాను.

**"ఏడుస్తాను గానీ, నువ్వే రోజు ఇంట్లో వుంటావు?"** అనడిగాడు.

నేను మామూలుగానే **"ఏ రోజన్నా పర్లేదు"** అన్నాను.

దానికి వాడు పావు గంట వికటాట్టహాసం చేసి, ఆనక **"సరే, అయితే నా పనయ్యాకా, లంచ్ మీయింట్లోనే, ఏదన్నా మీ స్పైసీ ఇండియన్ వంటకం చెయ్యి"** అన్నాడు.

**"ఫోనులో ఉన్నావు కాబట్టి బతికిపోయావు రా రేయ్, ఎదరుంటే పీకుచ్చుకుందును, మలపత్రాష్టుడా"** అని ఫోను కట్ చేసాను. అయినా కందకాలు చెయ్యడానికి నాదేవన్నా కృష్ణదేవరాయలవారి కోటా, ఆ పురుగులేవన్నా శత్రు సైన్యాలా? డబ్బులు ఎల్లా వడకాలా అని చూసే వాడే ప్రతీ గాడిదాను.

ఆమాటకేంగానీ, ఇంతకీ ఏంపేరెట్టాను కథకీ, ఆ ***"స్పార్క్"*** కదూ. వస్తున్నా, వస్తున్నా. అక్కడికే వస్తున్నా. బతుకు మరీ వానపాములా తయరైపోయింది. పగలూ రాత్రీ సోఫాలో పడేవడం. మధ్యలో లేచి పిల్లల్ని దింపడం, తేవడం. దీని కన్నా ఇల్లిల్లూ తిరిగి ఇత్తడి చెంబులమ్ముకున్నా బావుణ్ణు. మా చిన్నప్పుడు మీసాల రత్తయ్య లాగ. వాడు **"గిన్నెలండి, చెంబులండి"** అని అరుస్తూ, సైకిలు మీద వస్తూంటే ఆడవాళ్ళంతా క్యూ కట్టేవారు పెరటి గుమ్మాల దగ్గర. వాడు కూడా ఒక స్టైలు, స్థాయి మెయింటెయిన్ చేసేవాడు. వాడి కళ్ళలో స్పార్క్ వుండేది. వాడు అమ్మే ఇత్తడి, సీవెండి గిన్నెల్లో స్పార్క్ వుండేది. వాడితో బేరవాడే ఆడాళ్ళ కళ్ళల్లో ఆ స్పార్క్ రిఫ్లెక్ట్ అయ్యేది.

రోజు వారీ సంపాదన గల వాడికే అంత స్పార్కుంటే, మరి రెండు వారాలకోసారి గుత్తగా సంపాదించే అయాంబాబుగారికెంతుండాలి? కానీ విధి బలీయం. పెళ్ళైన పదేళ్ళ తరవాత ఈ స్పార్కు కాస్త తగ్గుతుందట. అక్కడినించీ మనం జాగ్రత్తగా మెయింటెయిన్ చెయ్యకపోతే కష్టంట. నాకేం తెలుసు. రోజూ విగ్గెట్టుకుని, దానికి రంగేసుకునే శీనిగాడు చెప్పాడు. మొన్నా మధ్య మా ఆవిడ కూడా ఇంట్లోంచి పని చేసుకుంది ఒక రోజు. ఆరోజు అసలు పిల్లల్ని స్కూళ్ళకి గెంటేసి, ఆనక లేట్ బ్రేక్ఫాస్టు, ఎర్లీ లంచీ, ఆనక లంచానంతర సినిమా, నిద్ర, అల్లం చాయ్ ***(లేచాకా అన్నమాట, వెధవ అనుమానాలూ మీరూను...),*** ఆనక పూరీ కూర ఇన్ని ఊహించుకున్నాను. ఒక్కటి జరిగేదవలేదు. పిల్లల్ని దింపి వచ్చానా? ఆవిడ మీటింగని ఫోను చెవులో గుచ్చేసుకుంది. నేను ఆఫీసు పని అరగంటలో కానిచ్చేసి, ఆనక ఏమి చెయ్యాలో తెలియక సూర్యనమస్కారాలు వేసుకుంటున్నాను.

ఇంతలో లంచి టైము దాటిపోయింది. ఆవిడ నాకు పప్పు, అన్నం వండేసి తినమంది. నువ్వు తినవా అంటే, ఓ వయసొచ్చాకా కుంభాలు లాగించకూడదు అంటూ రెండు టమాటో ముక్కలు, నాలుగు ఆనపకాయముక్కలు, ఇంకా ఏవో దిక్కుమాలిన ఆకులు, అలములు కలిపి మింగేసింది. నాకు

తినాలో వద్దో అర్థం కాలేదు. అయినా దులిపేసుకుని తినేసాను. అక్కడికి నా లేట్ బ్రేక్ఫాస్ట్, ఎర్లీ లంచి ప్లానులు బాహుమూలాలు నాకేసాయి. ఇక నిద్ర వంతు. నేను వెళ్ళి పక్కెక్కి విలాసంగా పడుకున్నాను ఓ గంటలో లేద్దామని ఒట్టుపెట్టుకుని. ఆవిడ వచ్చిందో లేదో తెలియలేదు గానీ, నిద్రమాత్రం వచ్చింది. రంపాలతో కోస్తున్నట్టు వాక్యూం క్లీనర్ శబ్దం వినబడ్డంతో అధాట్న లేచాను. ఆవిడ గోడలదగ్గరనించీ గడియారాల దాకా అన్నీ వాక్యూం చేసేస్తోంది. లేచి ఉత్తి టీ పెట్టుకుని తాగాను.

ఇంక లాభం లేదని దాన్ని పిలిచి అడిగాను "**ఏవిటే ఇలా తయారైంది కాపరం**" అని.

ఆవిడ చేతిలో రెండు ఇనప గుళ్ళు పట్టుకుని వంగుతూ లేస్తూ, ఆయాసపడుతూ చెప్పింది "**స్పార్కు పోతోందండీ మెల్లిగా**" అని.

నాకు చిర్రెత్తుకొచ్చింది. "**స్పార్కా, అంటే?**" అన్నాను ముక్కు చిట్లించి.

"**అంటే ఆ స్టైల్ తగ్గిపోతోందండీ. ఇదివరకు మిమ్మల్ని చూస్తే జిల్లని పించేది నాకూ, మా ఫ్రెండ్స్ కీ కూడా. ఇప్పుడు నాకే సరిగ్గా జిల్లని పించడం లేదు. వాళ్ళు మీగురించి అసలు కామెంట్ చెయ్యడమే మానేసారు, తెలుసా?** " అంది బెంగగా.

"**నన్ను చూస్తే నాకే జిల్లనదు, మీ ఫ్రెండ్స్ కి అనేదా, ఎవరే వాళ్ళు?**" అడిగాను ఎంతో ఆసక్తిగా.

"**అబ్బ, ఇప్పుడు కాదు, ఒకప్పుడు అనిపించేది. ఇప్పుడు మామూలే..ట**" అంది సాలోచనగా.

"**మామూలా? వాట్ మామూలు. ఇదివరకు బోంబే మిఠాయి అమ్మేవాడిలా గ వుండేవాణ్ణి ఇప్పుడు పీచు మీఠాయి అమ్ముకునే వాళ్ళాగ అయిపోయానా. చెప్పవే బాబూ, అసలే టెన్షన్ తో చచ్చిపోతున్నా**" అన్నాను ఏడుపు మొహంవెట్టి.

"**అబ్బా అది కాదండీ. మీరు అందరిలాగా ఉజ్జోగాని కెళ్ళరు. ఓ మంచి గుడ్డముక్కలు వేసుకోరు. ఎంత సేపూ పడవకి బోటేసే వాడిలాగా, సైకిలు ట్యూబుకి వల్కనైజింగ్ చేసేవాడిలాగ ఓ నల్ల లాగూ, అలుగ్గుడ్డ టీషర్టూ వేసుకుంటారు. కూరలు కొనడానికెళ్ళినా, హోటళ్ళకెళ్ళినా అదే రూపం. ఇదివరకు బాత్రూముకెళ్ళినా టై కట్టుకునే వెళ్ళేవారు. మరి తేడాలేదూ. అందుకే నలుగురూ అలా అనుకుంటున్నారన్నమాట**" అంది ఓపికగా వివరిస్తూ.

వెంటనే టీకప్పు పక్కకి విసిరేసి, బనీను బొజ్జమీదకి లాక్కుని ఆవేశంగా పాడాను " **ఎవరా నలుగురు ఏరా నలుగురు నీవాళ్ళా? నీలో వున్నవాళ్ళా? నిన్ను చూసి నవ్వే వాళ్ళా, నవ్వ లేక ఏడ్చేవాళ్ళా? ఎవరా___.**" అంటూ రాగం తీస్తూంటే, ఓ ఇనప గుండు కాలుమీద పడింది.

కాలు పచ్చడై, కంటిలో కన్నీరు ఘనీభవించింది. మా ఆవిడ నిర్దాక్షిణ్యంగా రెండో గుండు తీసుకుని కిందకెళిపోయింది వంగుతూ, లేస్తూ. అప్పుడర్థమైంది పాటకి వున్న పవరేవిటో. ఇంక లాభం లేదు నా "పురుష కారం" మీద దెబ్బడిపోతోందని గ్రహించి బుసలు కొట్టాను. వెంటనే దేవుడి గదిలోకెళ్ళి ఓ హారతి కర్పూరం ముక్క తెచ్చి అరచేతిలో పెట్టుకున్నాను.

వెలిగించుకునే ధైర్యం లేక అలాగే ప్రతిజ్ఞ చేసేసాను "**ఓ పంచ భూతములారా, దెయ్యములారా, దేవతలారా, నరసింహరాజూ, ప్రభా, జెయమాలినీ", మీ అందరి సాక్షిగా నేటి నించీ నేను కోలుపోయిన స్పార్కు తిరిగి తెచ్చుకునే వరకు మీ మొహం చూడను**" అని ఊగిపోయాను.

వాళ్ళంతా "**హమ్మయ్య, వీడి పీడా వొదిలింది**" అనుకుని చక్కా పోయారు. అక్కడితో నా కష్టాలు మళ్ళీ మొదలయ్యాయి.

ఎందుకేనా మంచిదని శీనిగాడికి ఫోను చేసాను.

"**ఒరేయ్, నువ్వు మూడో క్లాసు నించీ విగ్గెట్టుకున్నావని నాకు తెలుసు. అయినా నీకంత లేడీ ఫాలోయింగు. నేనేమో సొంత బొచ్చు ఉన్నా కూడా, కనీసం బొచ్చుకుక్క ఫాలోయింగ్ కూడా లేదు. అంతెందుకు ఈ మధ్య వరకు మా ఆవిడ ఫ్రెండ్స్ కొంతమందికి నన్ను చూస్తే జిల్లనేదిట. ఇప్పుడు అనట్లేదట. ఏంచెయ్యాలో చెప్పరా బాబూ, లేకపోతే నామీద నాకే డౌట్లొస్తున్నాయి**" అన్నాను ఏడుపు గొంతుతో.

"**ఒరేయ్ పిచ్చోడా, ఇది చాలా కామన్ ప్రాబ్లం. ఇప్పటికి ఇరవైమందికి ట్రైనింగ్ ఇచ్చాను. అందరికీ ఇరగదీసే స్పార్కులొచ్చేసాయి. నువ్వో పని చెయ్యి. నా దగ్గిర ఓ ఆరు క్లాసులకి రా. మొత్తం వెయ్యి డాలర్లు. ఓకేనా?**" అన్నాడు ధీమాగా.

"**ఒరేయ్ శీనిగా, నువ్వెంత మంచివాడివిరా, ఆరు క్లాసులు చెప్పి, వెయ్యి డాలర్లిస్తావా, తప్పకుండా వస్తారా, నీలాంటి స్నేహితుల గురించి ఏదో సంస్కృత పద్యం వుండాలి, చప్పున గుర్తు రాట్లేదు, ఆనక చెప్తానే..**" అన్నాను ఆనందంతో వణికే గొంతుతో.

"అదే మరి, క్లాసు చెప్పి, డబ్బులు కూడా నేనే ఇవ్వడానికి ఇదేవన్నా నోము ఉజ్జాపన అనుకున్నావా, కుంకా, డబ్బులుంటే పట్టుకు క్లాసుకు రా. లేకపోతే రేప్పొద్దున్న "పెద్ద బావగారు ఆడంగుల్లో లెఖ్ఖే" అన్నట్టుంటది సంబడం, ఆలోహించుకో.." అనేసి ఫోను కట్ చేసేసాడు.

ఇంక నావల్ల కాలేదు. వెధవ వెయ్యి, పోతే పోయింది. స్పార్కు పోతే మళ్ళీ రాదు అనుకుని, ఇంటిమీద లోన్ తీసుకుని, డబ్బు కట్టేసి, ఆరు క్లాసులకీ వెళ్ళొచ్చా.

థియరీ వచ్చేసింది. ఇక ప్రాక్టికల్స్ కి రెడీ అయిపోయాను. ఓం ప్రథమంగా ఓ మంచి రోజు చూసి నా బట్టలన్నీ చారిటీకి ఇచ్చేసాను. వాళ్ళో రెండు రోజులు పోయాకా వార్నింగ్ లెటర్ రాసి, ఆ బట్టలని మా ట్రాష్ కేన్లో కుక్కేసి పోయారు. పనిలో పని, వారి తరపునించి ఓ కొత్త జెత బట్టలు ఓ పేకెట్లో పెట్టి మా గుమ్మం ముందు పడేసి పోయారు. నేను ఇలాంటి అవమానాలకి లొంగే రకాన్ని కాను కాబట్టి, మర్నాడే ఔట్ లెట్ మాల్ కి వెళ్ళి ముచ్చటగా మూడు వేలు తగలేసి గుడ్డముక్కలు కొన్నాను. చిరిగిన జీన్సులు మూడు, బిర్ర బిగుసుకు పోయిన చొక్కాలు ఆరు, రంగు రంగుల బాక్సర్లు, చేతుల్లేని బనీన్లు, గోల్ఫు చొక్కాలు, లాగులు, పన్నెండు రకాల బూట్లు.

ఇంతలో మా ఆవిడ ఫ్రెండ్స్ పార్టీ ఇచ్చారు. దేనికో తెలియదు. నేను ఓ చిరిగిన జీన్సు, చేతుల్లేని టీషర్టూ వేసుకుని వెళ్ళాను. లోపలికి వెళ్ళగానే ముందు రూములో మొగాళ్ళున్నారు. వాళ్ళతో నాకేం పని. మన టెస్టింగ్ సాంపిల్స్ అంతా లోపల హాల్లోనూ, కిచెన్ లోను వున్నారు. మా ఆవిడ కూడా అక్కడే వుంది. వెంటనే అక్కడికి వెళ్ళాను కాస్త అటూ, ఇటూ ఊగుతూను. అచ్చంగా అలాగే కాకపోయినా కాస్త అటూ ఇటూగా సర్దార్ ట్రైలర్ లో పవన్ కల్యాణ్ లాగ వున్నానని నాకే అనిపించేసింది. (నాకు సిగ్గు బాబు).అలా ఊగుతూ వెళ్ళి మా ఆవిడ మీద చెయ్యేసి "హనీ, వాటర్ కావాలి" అన్నాను.

పక్కనే వున్న ఆవిడ ఫ్రెండ్ కళ్ళలోకి చూస్తూ. ఆవిడ జడుసుకుని రెండు స్టెప్పులు వెనక్కి వేసి, ఫ్రిజ్ చూపించింది భయం భయంగా. నేను అలాగే ఊగుతూ వెళ్ళి ఫ్రిజ్ పక్కన వున్న ఇంకో ఆవిడ్ని కాస్త దగ్గరగా వెళ్ళి పలకరించి "**కప్స్ ఎక్కడ వున్నాయి?**" అన్నాను కొంచెం మత్తుగా.

ఆవిడ మొహం చిట్లించి "**ఇది మా ఇల్లు కాదు. ఐ డోంట్ నో**" అనేసి హాల్లోకెళిపోయింది.

మా ఆవిడకి విషయం అర్థమై మంచినీళ్ళిచ్చి "**ఇక్కడెందుకు ఆడంగచ్చెక్కలాగ, ముందు రూములోకి ఫోండి**" అంది చెవి మెలిపెడుతూ.

"**అది కాదే, ఎవరికి జిల్లందో నువ్వు చెప్పట్లేదు, నేను తెలుసుకోవాలి, ఎలామరి?**" అన్నాను బుంగమూతి పెట్టి.

"**నేను కనుక్కుని చెబుతాలెండి, ముందు మీరు ఫోండి**" అంది తోస్తూను. సరే ఆ తోపుకి ఫ్రంట్ రూం లోకి వెళ్ళి పడ్డాను.

నా చిరిగిన పేంట్ చూసి, ఇంటి వాళ్ళబ్బాయి వచ్చి "**అంకుల్, ఇక్కడ చింపుకోవడం చాలా పాత స్టైలు, ఇప్పుడు ఇక్కడ చింపుకోవాలి**" అనేసి వెనకాల సీటు దగ్గర ఓ లాగు లాగాడు. బర్రుమని చిరిగి జేబు ముక్క వేళ్ళాడుతోంది. చేసేదిలేక సోఫాలో కూలబడ్డాను.

అందరూ అప్పటికే నానా రకాల మందులూ కలుపుకుని, బుర్రు బుర్రుమని తాగేస్తున్నారు. నేను సాఫ్ట్ డ్రింకు గాణ్ణి. కానీ శీనిగాడి లెసన్ గుర్తొచ్చి ఒక కాక్టెయిల్ గ్లాసు పుచ్చుకుని మళ్ళీ హాల్లోకెళ్ళాను. అక్కడ ఒకావిడ ఫోను మాట్లాడుతోంది.

ఓ ట్రయల్ వేద్దామని ఆవిడ కేసి చూస్తూ "**ఐ లైక్ థిస్ నీట్. స్ట్రైట్ అప్ అన్నమాట**" అనేసి తాగేసాను.

అలా ఊగుతూ బాత్రూం లోకి వెళ్ళి అక్కడ సింకులో ఉమ్మేసి బైటికొచ్చాను.

ఆవిడ నాకేసి అదోలా చూసి వెళిపోయింది. "**యెస్. స్పార్క్ మెల్లిగా వస్తోంది**" అనుకున్నాను.

ఆ ఉత్సాహంలో ఇంకో గ్లాసు లాక్కొచ్చి ఇంకో ఆవిడ దగ్గరికెళ్ళాను.

ఆవిడ చేతిలో అప్పటికే అదే గ్లాస్ వుంది. "**ఓ మీది కూడా సేం టేస్ట్. యా, అయ్ లైక్ బ్లడీ రోజీ. వాట్ ఎ డ్రింక్, పెర్ఫెట్ ఫర్ ఈవెనింగ్ రొమాన్స్**" అన్నాను ఆవిడ కళ్ళలోకి చూస్తూ.

ఆవిడకి చిర్రెత్తింది "**ఇది బ్లడీ మేరీ. రోజీ కాదు. నువ్వేం కలుపుకొచ్చావో ఏం పాడో..అయినా రొమాన్స్ కి టైమేంటి**" అంది ఒకన్ను నా కుడిభుజం కేసి, రెండో కన్ను ఎడం భుజానికి రెండడుగుల అవతలకి వేసి. నాకు కళ్ళు తిరిగాయి. ఆవిణ్ణి డిస్టర్బ్ చెయ్యడం ఇష్టం లేక మళ్ళీ బాత్రూంలోకి వెళ్ళి ఉమ్మేసొచ్చాను.

పార్టీ అయిపోతోంది. మగవెధవలంతా చేతుల్లో గ్లాసులతో, దూరంనించే హేపీ బర్త్డేలు పాడేస్తున్నారు. నాకు అప్పటికే ఆకలేసి, సేఫ్టీ కోసం ఓ ప్లేటు కింద ఇంకోటెట్టుకుని, ప్లేట్లనిండా అన్నం, పప్పు, రెండు కూరలు పెట్టుకుని లాగిస్తున్నాను.

ఇంతలో ఇందాకా చూసిన అవుటాఫ్ ఫేజ్ ఆవిడ మళ్ళీ వచ్చింది. నాకేసి చూసి, ఎవడో తద్దినం బేమ్మణ్ణి చూసిన లుక్కిచ్చి, **"యూ కంటిన్యూ..."** అనేసి, తూలుకుంటూ ముందు గదిలోకెళ్ళిపోయింది.

**"ఇదేటిది? ఈవిడొక్కత్తికే జిల్లుమన్నట్టనిపించింది ఇందాకా, ఇప్పుడు ఈవిడ కూడా ఇలా తిరస్కరించేసి పోయిందా, హత విధీ...."** అనేసి ప్లేటు చెత్త డబ్బాలో పారేసి మా శాల్తీలన్నిటినీ కారులో కుక్కేసి ఇంటికొచ్చేసాను.

రాత్రి శీనిగాడికి ఫోను చేసి **"నా డబ్బులు నాకిచ్చేయ్, నీ ప్లానులేవీ పనిచెయ్యలే.."** అని అరిచాను ఆవేశంగా.

వాడు నవ్వి **"అసలేం జరిగిందో చెప్పు"** అన్నాడు కూల్ గా. చెప్పాను.

**"మరి ఆ తిండేవిట్రా. ఈ సారి నేను లెసన్ టూ లో చెప్పినట్టు చెయ్యి. ఎక్కడన్నా పార్టీ అంటే, ఇంట్లో నీక్కావలసిన తిండి పీకలదాకా తినేసి అప్పుడు వెళ్ళు. అక్కడ ప్లేట్లో రెండు చెర్రీ టమోటాలు, నాలుగు అనాస ముక్కలు, ఓ పెద్ద పుచ్చకాయ ముక్కా పెట్టుకో. పుల్లతో తిను. తింటున్నప్పుడు మధ్య మధ్య వంటింటి కేసి వెళ్ళిరా. అప్పుడు అందరి దృష్టీ నీమీద పడుతుంది. ఆనక మొన్న కొన్న గోల్ఫు డ్రెస్సు వేసుకో. గోల్ఫు టోపీ పెట్టుకో. డ్రైవిం రేంజి కి వెళ్ళి క్లబ్బు ఎలా పట్టుకోవాలో వాళ్ళని అడిగి, ఓ ఫొటో తీసుకుని ఫేస్ బుక్కులో పెట్టు. మీ ఆవిణ్ణి టాగ్ చెయ్యి. ఆనక మీ ఆవిడ ఫ్రెండ్స్ ఎక్కడ పరిగెడతారో కనుక్కో. ఏ జిమ్ము కెళతారో కనుక్కో. టైమింగ్ ఇంపార్టెంటమ్మా. వాళ్ళు వచ్చే వేళకి మనం బైటికి రావాలి జిమ్ము లోంచి. వాళ్ళు పరిగెట్టే వేళకి మనం పూర్తిగా తడిసి ముద్దై పోయి కనపడాలి వాళ్ళకి. అప్పుడు మళ్ళీ స్పార్కు వస్తుంది. వాళ్ళకి నచ్చితే వాళ్ళు మీ ఆవిడకి చెబుతారు. అప్పుడు మీ ఆవిడకి కూడ స్పార్కొచ్చి మళ్ళీ బండి గాడిలో పడుతుంది. అర్థమైందా?"** అనేసి ఫోను పెట్టేసాడు.

**"ఏవిటో, హెడ్ మేష్టారి సంతకం లాగా, హిందీ మేష్టారి పాఠం లాగ అర్థం అయ్యీ కానట్టుగా వుంది, సర్లే ట్రై చేద్దాం"** అనుకుని పక్కకెళ్ళేసాను.

తరవాత నెలరోజుల జిమ్ముల చుట్టూ తిరగటాలూ, రోడ్లమ్మట పరిగెత్తడాలూను. అక్కడక్కడా ఆడ లేడీసు కనపడ్డా ఆట్టే చూడలేదు నన్ను. నాకు అర్థం కావట్లేదు. రోజు రోజుకీ నాలా నలిగిపోయే మగ పీనుగులతో జిమ్ములూ, రోడ్లూ నిండి పోతున్నాయి. కానీ స్పార్కు రావట్లేదు.

ఇలాకాదని ఓ రోజంతా నిద్రపోయి ఓ సూత్రం కనిపెట్టా. వెంటనే అమలు చేసి చూసా. మామూలుగానే ఎనిమిదింటికి లేచి ఎనిమిదిన్నరకి జిం ముందు నిలుచున్నా. ఆపాటికి లేడీసు జిమ్ములోంచి ఏంజిల్సు లాగ తయారై ఆఫీసుకి పోడానికి సిద్ధంగా వున్నారు. నేను ఎంకౌంటరిచ్చాను.

**"మీరు, రూప. యా. సారీ, లాస్ట్ టైం పార్టీలో చూసినప్పుడు చాలా డిఫరెంట్ గా ఉన్నారు. గుర్తు పట్టలేకపోయాను, సారీ.."** అన్నాను గబగబా.

" డిఫరెంట్ గానా?" అంది ఆవిడ.

**"అదే, మీరు, చాలా వెయిట్ లూజయ్యారు. యూ లుక్ వెరీ అథ్లెటిక్. ఎనీవే నేను ఈ జిమ్ము లో జాయినవుదామనుకుంటున్నాను. యు నో, ఐ నీడ్ టు లూజ్ వెయిట్. ఆఫ్ కోర్స్ అందరూ మీఅంత పంక్చువల్ గా వుండరనుకోండి.."** అన్నాను.

అంతే, ఆకాశం లో సూర్యుణ్ణి పక్కకి తోసి మేఘాలొచ్చేసాయి. ఒకటో రెండో మెరుపులు కూడా వచ్చేసాయి. ఆవిడ నన్ను తీసుకెళ్ళి జిమ్ములో జాయిన్ చేసి, నాలుగు బస్కీలు కూడా నేర్పి వెళ్ళింది. అలాగే మరో నాడు మరో వనితామణి కనబడింది.

**"హాయ్, మీరు దీప, మొన్న మా ఆవిడ చెబుతోంది, మీరు మేరథాన్ సైన్ అప్ చేసారట కదా. టూ మచ్చండీ మీరు. అసలు పిల్లలతోటి, ఫామిలీతోటి, ఆఫీసు డ్యూటీస్ తోటి అసలు టైమెక్కడ కుదురుతోందండీ బాబూ, సింప్లీ గ్రేట్.."** అన్నాను.

ఆవిడ నాకు లంచి కూపన్లు కొనిపెట్టి వెళ్ళింది. ఇలా వారం రోజులు గడిచేసరికి మా ఇంట్లో మెనూ మారింది. నా గోల్ఫు ఫొటోకి నాలుగొందల లైకులొచ్చాయి. నాకు వారానికి రెండు లంచి కూపన్లూ, మా ఫామిలీకి నెలకి నాలుగు డిన్నర్ ఇన్విటేషన్లూ వస్తున్నాయి. నేనూ మార్గ దర్శనంలో జాయినై, నా కాపరం నిలబెట్టుకున్నాను. మా ఇంట్లో మెనూ మారింది. మళ్ళీ త్రీ కర్రీస్ త్రీ చట్నీస్ తోటి, ఆరారగా టిఫిన్ల తోటీ కంచం

కళకళలాడుతోంది. మా ఆవిడ అప్పుడప్పుడూ ఫోను ఆపి, నాతో మాట్లాడుతోంది. వాళ్ళ ఆఫీసులో నా స్టాకు పెరిగిందట, ముసి ముసి నవ్వులు నవ్వుతూ చెబుతోంది.

ఇలా ఆనందంగా *"వెన్నెల లోనే హాయి ఏలనో"* అని పాడుకుంటూ వుండగా ఫోను మోగింది.

శీనిగాడు. నావల్ల వాడి బిజినెస్ కి దెగ్గడిపోయిందిట. వాడి క్లాసులకెవడూ రావట్లేదట. అందరూ నా దగ్గర ట్రెయిన్ అవుదామని అనుకుంటున్నారట. నా సీక్రెట్ చెప్పమని బతిమాలాడు.

**"దొంగ పీనుగా, రెండువేలిచ్చి నా క్రాష్ కోర్సులో జాయినవ్వు. ముందా విగ్గు తీసేయ్, అచ్చం పోస్టు డబ్బామీద సంచీ పెట్టినట్టు ఫేసు, నువ్వూను. మిగితా కుంకలకి కూడా చెప్పు, రేపు సాయంత్రం లోపల జేరితే కన్సీషనిస్తానని. పెట్టేయ్ ఫోను, మా ఆవిడ జిలేబీలు తెస్తోంది, తొక్కలో డిస్టర్బెన్సూ నువ్వూను.."** అనేసి ఫోను కట్ చేసా.

మా ఆవిడ వెండి పళ్ళెంలో రెండు రకాల జిలేబీలట్టుకొచ్చి అడిగింది

**"ఏవండీ, మా ఫ్రెండ్సంతా మీగురించే డిస్కషను. మీరు చాలా బాగా మాట్లాడతారట. భలే కాంప్లిమెంట్లిస్తారట. మీరు చాలా సన్నబడ్డారట ఈ మధ్యన. అందరూ అంటున్నారు. సరె గానీ మీకు ఆరెంజి జిలేబీ కావాల, రెడ్ జిలేబీ కావాలా?"** అంది ఆరాధనగా.

ఆవిడ రెండు కళ్ళల్లోంచీ రెండు స్పార్కులు మొదలై, నా కళ్ళలోకొచ్చి మాయమయ్యాయి. ఎక్కడో షార్ట్ సర్క్యూట్ అయి, కరెంటు పోయింది..

## (వచ్చే సంచిక దాకా లైట్ తీస్కోండి!)

POST YOUR COMMENTS